డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఎంఐఎం నాయకులు

కాగజ్‌నగర్, నవంబరు 2: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎంఐఎం నాయకులు శనివారం డీఎస్పీని కలిసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంఐఎం పట్టణఅధ్యక్షుడు మోబీన్ మాట్లాడుతూ ఈసుగాంలో తలెత్తిన సమస్యపై న్యాయం చేయాలన్నారు. ఇంతవరకు పోలీసులు ఈవిషయంలో న్యాయం చేయడం లేదన్నారు. డీఎస్పీస్థానికంగా లేకపోవటంతో టౌన్‌సీఐకి తమ సమస్యను వివరించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, బాధిత కుటుంబసభ్యులున్నారు.

కాంగ్రెస్‌లో భగ్గుమన్న గ్రూపు విభేదాలు

- కులగణన జిల్లా స్థాయి సమావేశంలో ఘర్షణ
- ఇరువర్గాల మధ్య తోపులాట, పరస్పర దాడులు
- శ్యాంనాయక్ వర్గీయుల ఆందోళన
- అరెస్టు చేసిన పోలీసులు


రోజ్‌గార్డెన్ ఎదుట ఆందోళన చేస్తున్న శ్యాంనాయక్, వర్గీయులు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపువిభేదాలు గుప్పుమన్నాయి. డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, ఆసిఫాబాద్ నియోజకవర్గఇన్‌చార్జీ శ్యాంనాయక్ వర్గీయులమధ్య ఎన్నో రోజులుగా కొనసాగుతున్న విబేధాలు శనివారం జరిగిన కులగణన జిల్లాస్థాయి సమావేశంలో బయటపడి తారస్థాయికి చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల6నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన కులగణన పైజిల్లాస్థాయి సదస్సులు నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో జిల్లాకేంద్రంలోని రోజ్‌గార్డెన్ ఫంక్షన్‌హాలులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్‌పార్టీనాయకులు హాజరయ్యారు. ఆసిఫాబాద్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి శ్యాంనాయక్ తనవర్గీయులతో కలిసి సమావే శానికి హాజరయ్యారు. సమావేశం కొనసాగుతుండగా కొంతమంది నాయకులు తమకు సమావేశంఉన్నట్లు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించడంతో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఇరువర్గీయుల మధ్య వాగ్వాదం పెరగడంతో ఒకరిపై మరొకరు కుర్చీలు విసురుకున్నారు. ఆపై ఇరువర్గాలు పరస్పరదాడులకు దిగడంతో కొంతమంది నాయ కులకు గాయలయ్యాయి. దీంతో సమావేశంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల మధ్యఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు కల్పించుకొని శ్యాంనాయక్‌తోపాటు అతనివర్గీయులను సమావేశంనుంచి బయటకు తీసుకువచ్చారు. దీంతో శ్యాంనాయక్ వర్గీయులు ఆందోళనకు దిగారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టుచేయాలని డిమాండ్‌చేశారు. ఈక్రమంలో సమావేశంలోకి వెళ్లేందుకు శ్యాంనాయక్ వర్గీయులు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని గేటు మూసి వేశారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు, శ్యాంనాయక్ వర్గీయు లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని తెలుసు కున్న కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళన విరమించక రోజ్‌గార్డెన్ ప్రధానగేటు ఎదుట బైఠాయించి డీసీసీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు శ్యాంనాయక్‌తో పాటు అయన వర్గీయులను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అదిష్ఠానానికి నివేదిస్తాం..
- కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, డీసీసీ అధ్యక్షుడు

కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధిష్ఠానం ఇచ్చినపిలుపులో భాగంగా జిల్లాకేంద్రంలో కులగణనపై జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేశాం. సమయం తక్కువగా ఉండటంతో కాంగ్రెస్‌పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో సమావేశం నిర్వహిస్తున్నట్లు అందరికీ సమాచారం పంపించి ఆహ్వానం పలికాం. కానీ కొంతమంది నాయకులు తమకుసమాచారం ఇవ్వలేదని పేర్కొనడం సమంజసం కాదు. సమావేశాన్ని చెడగొట్టే ఉద్దేశంతోనే వారు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారు. ఈవిషయంపై చర్యలుతీసుకోవాలని అదిష్ఠానానికి నివేదిస్తాం.

పంటలకు.. అడవిపందుల బెడద

- చేలను ధ్వంసం చేస్తున్న అడవిపందులు
- తీవ్రంగా నష్టపోతున్నరైతులు
- అటవీఅధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

బెజ్జూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పంట చేతికొచ్చే సమయంలో సరైన వర్షాలు కురవక ఆపసోపాలు పడుతున్న అన్నదాతకు అడవిపందుల రూపంలో మరో ఎదురుదెబ్బ ఎదురవుతోంది. రైతులు సాగుచేస్తున్న పత్తి, వరి, కంది పంటలకు అవి చేస్తున్న నష్టం అంతా.. ఇంతా కాదు. ముఖ్యంగా సిర్పూర్ నియోజకవర్గంలోని బెజ్జూరు, చింతలమానేపల్లి, పెంచికలపేట, సిర్పూర్(టి) మండలాల్లోనే పందుల బెడద ఎక్కువగా ఉంది. రైతులు సాగుచేసిన పత్తిపంటలను పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం పత్తి పూత,కాతకాలం. ఈ సమయంలో పంట చేలల్లోకి అడవిపందులు గుంపులు గుంపులుగా వచ్చి నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రక్షణ కోసం అనేక పాట్లు..

సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అటవీసమీప ప్రాంత పంటచేలల్లో అడవిపందుల బెడద ఎక్కువగా ఉండటంతో అన్నదాతలు పంటచేల చుట్టూ చీరలు, జాలీలు కట్టి రక్షణచర్యలు చేపడుతున్నారు. అయినా అడవిపందులు రక్షణ వలయాలను ధ్వంసంచేసి పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రాత్రి, పగలు తేడాలేకుండా పంటచేలల్లోనే కాపలా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి పందులు గుంపులుగా వచ్చినసమయంలో దాడిచేస్తాయనే భయంతో ఏం చేయలేక పోతున్నామని పేర్కొంటున్నారు. పంటచేలల్లోవిడతలవారీగా కుటుంబసభ్యులు కాపలా ఉంటున్నా రక్షించుకోలేక పోతున్నామన్నారు. బెజ్జూరు మండలంలోని కుశ్నపల్లి-సోమిని గ్రామాల రైతులు పత్తి,కంది పంటలను కాపాడుకునేందుకు జాలీలు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు పంటలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదుకోని ప్రభుత్వం..

జిల్లాలోని అటవీప్రాంత గ్రామాల పంటచేలల్లో కాకుండా నియోజకవర్గంలోకూడా అడవిపందుల కారణంగా ప్రతీఏటా పంటలకు నష్టం జరుగుతోంది. అయినా అటవీశాఖ ఎలాంటిసాయం అందించడం లేదు. దశాబ్దంగా ఈ సమస్య అధికంగా ఉంది. అడవి పందులకారణంగా పంటలకు నష్టంజరుగుతున్నా నష్ట పరిహారం మాత్రం కూడా ఇవ్వడం లేదు. గతప్రభుత్వ హయాంలో పంటలను ధ్వంసంచేస్తున్న అడవిపందులను చంపేందుకు ఉత్తర్వులు జారీచేసినా అనేకషరతులు పెట్టింది. దీంతో అటవీ శాఖకూడా ఏం చేయలేకపోయింది. ఇప్పటికే పలుగ్రామాల్లో ఎకరాల్లో పత్తి, వరిపంటలను ధ్వంసంకావడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నోఏళ్లుగా పంటలకునష్టం సంభవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.



అడవి పందుల దాడిలో ధ్వంసమైన పత్తిచేను


కంది పంటకు రక్షణగా రైతులు ఏర్పాటు చేసిన జాలి

పరిహారం ఇవ్వాలి..
- వడ్డూరి శ్యాంరావ్, రైతు, ఎల్కపల్లి



అడవి పందుల దాడిలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి. ఏటా ఇదేతంతు. సాగుచేస్తున్న పత్తి, వరిపంటలకు తీవ్రనష్టం కలుగుతోంది. అయినా తమగోడును ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

పంటలకు రక్షణ కరువైంది..
- చటారి ఐక్కయ్య, రైతు, ఎల్కపల్లి



ఎంతో కష్టపడి సాగుచేస్తున్న పంటలకు రక్షణ కరువైంది. పంటలను కాపాడుకునేందుకు ప్రతినిత్యం ఇంట్లో వారంతా చేలల్లోనే కాపలా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అయినా పంటలకు నష్టం జరుగుతూనే ఉంది. ఇకఅడవిపందుల బెడద కారణంగా వ్యవసాయం చేయడం కష్టతరంగా మారింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి


వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వానాకాలం వరిధాన్యం కొనుగోలుకేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిఉత్తంకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాలకలెక్టర్‌లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పూర్తి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 34కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామని ఈ నెల15నుంచి వరికోతలు ప్రారంభం అవుతాయని తెలిపారు. సహకార శాఖ, ఐకేపీఆధ్వర్యంలో కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గోదాంల పరిశీలన, జిల్లాలోని రైస్‌మిల్లర్లతో సమావేశం, బ్యాంకు గ్యారంటీ, మిగిలిన సీఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేసేందుకు పర్యవేక్షిస్తామని తెలిపారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలుకేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ, తూకం యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, తేమయంత్రాలు, గోనె సంచులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు బోనస్ ఇస్తున్నందున సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలు కొరకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల, మార్కెటింగ్, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలి..
- రాష్ట్రఆర్థికశాఖ ప్రత్యేకకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

ఆసిఫాబాద్‌రూరల్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన అంశాలపై ప్రభు త్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేకకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ప్రతి ఎన్యుమ రేటర్ ప్రతిఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలు సేకరించాలని తెలిపారు. కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌కింద నిర్ణయించిన కుటుంబాల వివరాలు నమోదు చేయాలన్నారు. వివరాల సేకరణలో గోప్యత, నైతిక ప్రమా ణాలు పాటించాలన్నారు. కేటాయించిన బ్లాక్‌లో అన్ని కుటుం బాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఆర్డీవోలోకేశ్వర్‌రావు, ముఖ్యప్రణాళికాధికారి కోటయ్యనాయక్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 6నుంచి ప్రారంభమయ్యే సర్వేకు జిల్లాలో పూర్తి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇంటి యజమానుల జాబితాను రూపొందించామని తెలిపారు. జిల్లాలో 1543 ఎన్యుమరేటషన్ బ్లాక్‌లను గుర్తించామన్నారు. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలలో సర్వే నిర్వహణ కొరకు ఎస్‌జీటీలు, ఇతర సమర్థులైన సిబ్బంది నియమించామని తెలిపారు. 168మంది సూపర్‌వైజర్లుగా నియమించామన్నారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతిగౌడ్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్‌లు, విద్యాశాఖాధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

గిరిజన కళాకారులకు ప్రోత్సాహం

- ఉమ్మడిజిల్లా అటవీశాఖ కన్జర్వేటర్ శాంతారాం



మడావి ఆనంద్‌ను సన్మానిస్తున్న అటవీ అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గిరిజన కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు అటవీశాఖ కృషి చేస్తుందని ఉమ్మడిజిల్లా అటవీశాఖ కన్జర్వేటర్ శాంతారాం అన్నారు. జైనూరు మండలానికి చెందిన మడావి ఆనంద్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న సందర్భంగా శనివారం జిల్లాకేంద్రంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌తోకలిసి ఆనంద్‌ను సన్మానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అటవీశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో జిల్లాకుచెందిన కళాకారుడు అత్యంత కళా ప్రదర్శనను ప్రదర్శించిన చిత్రాలకు గుర్తింపు లభించిందని తెలిపారు. జిల్లాలోనూ గిరిజన కళాకారులకు వర్క్‌షాప్ నిర్వహించే అవకాశం ఉందన్నారు. గిరిజనులలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజనుల సంప్రదాయాలపై కళాత్మక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటాయన్నారు. కార్యక్రమంలో అటవీశాఖసిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీ వలలో జైనూరు తహసీల్దార్, కార్యదర్శి

జైనూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జైనూరు మండల తహసీల్దార్, గ్రామకార్యదర్శి శనివారం రూ.12వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి చెప్పిన వివరాల ప్రకారం.. జైనూరు మండలంలోని పోచంలొద్దిలో ఇటీవల రూ. 10లక్షల రూపాయల నిధులతో కాంట్రాక్టర్ కేంద్రె సుబోధ్ రోడ్డు నిర్మించాడు. ఇందుకు సంబంధించిన బిల్లు మంజూరు చేయడానికి సుబోధ్‌ను జైనూర్ తహసీల్దార్ తిరుపతి, గ్రామకార్యదర్శి శేఖర్ 12వేల రూపాయలు డిమాండ్‌చేశారు. దీంతో అతడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సుబోధ్ 12వేల రూపాయలు తహసీల్దార్ తిరుపతి, గ్రామకార్యదర్శి శేఖర్‌కి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు.


ఏసీబి అధికారులు పట్టుకున్న తహసీల్దార్ తిరుపతి, గ్రామ కార్యదర్శి శేఖర్

సీఎంకు విద్యార్థుల కృతజ్ఞతలు


సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇటీవల డైట్‌చార్జీలు, కాస్మోటిక్‌చార్జీలను పెంచినందుకు శనివారం సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శనివారం మండలంలోని తెలంగాణ గిరిజనబాలికల డిగ్రీకళాశాల విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని పట్టుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ గతంలో తమకు డైట్ చార్జలు, కాస్మోటిక్‌చార్జీలు తక్కువగా ఉండేవని సీఎం రేవంత్‌రెడ్డి వాటిని పెంచడం తమకు ఇబ్బందులు లేకుండా పోయాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, వైస్ ప్రిన్సి పాల్ సంధ్యారాణి, లెక్చరర్‌లు కల్పన, వినోద్, నాగరాణి, జ్యోతి, తిరుమల, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే పీటీజీ గిరిజన గురుకులంవిద్యార్థులు సైతం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

పెంచికలపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెడ్వాయి జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం ఎంఈవో రమేష్‌బాబు చెకుముకి సైన్స్‌సంబరాలు-2024పోస్టర్లను విడుదలచేశారు. ఈసందర్భంగా జన విజ్ఞానవేదిక జిల్లాఅధ్యక్షుడు రాజకమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సంబరాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగాఉన్న అసిస్టెంట్ కుక్‌పోస్టుకు అర్హులైనఅభ్యర్థులు ఈనెల8లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రమేష్‌బాబుతెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాకేష్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, శిల్ప, ధ్రుపదా, పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈఓ రమేష్‌బాబు

ప్రారంభమైన రాష్ట్ర స్థాయి బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆసిఫాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాబాలికల పాఠశాలలో పీడీ కీ.శే గడిగొప్పుల సదానందం జ్ఞాపకార్థం నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్‌పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మాజీఎంపీపీ మల్లికార్జున్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్యాంసుందర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్ క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈనెల4 వరకు జరిగే పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రమేష్, ఎ.రమేష్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సుధాకర్, లింగారావు, అరవింద్, రాకేష్, జంగు, సదానందం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆసిఫా బాద్ పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలును శనివారం జిల్లా న్యాయసేవాధికా సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్‌జడ్జి కె.యువరాజ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్క ఖైదీ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆర్థికస్తోమత లేని వారికి ఉచిత న్యాయవ్యాదులను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. మద్యానికి బానిసలు కావొద్దని సూచించారు. అనంతరం జైలులోని వంటశాలను పరిశీలించారు. ఆయనవెంట లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ డివెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లీగల్‌డిఫెన్స్ కౌన్సిల్ అంజని దేవి, సూపరింటెండెంట్ కె ప్రేంకుమార్, జైలు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందిస్తాం: పీవో ఖుష్బూ గుప్తా


విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

వాంకిడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆశ్రమపాఠశాలలో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందిస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా పేర్కొన్నారు. శనివారం ఆశ్రమపాఠశాలను ఆమె సందర్శించారు. అస్వస్థతకు గురవుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులు అందిస్తున్న ఆహారం, మంచినీరు తదితర అంశాలపై పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులు అందిస్తున్న వైద్యచికిత్సపై ఆర్‌బీఎస్‌కే వైద్యసిబ్బందిని అడిగితెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. విద్యా ర్థినులకు సకాలంలో వైద్యం అందించి ఆరోగ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని ఆందోళన పడొద్దని పేర్కొన్నారు. ముగ్గురు విద్యార్థినులకు ఇన్‌ఫెక్షన్ పెరగడంవల్ల ఒకరిని కాగజ్‌నగర్‌కు, మరొకరిని ఆసిఫాబాద్ వైద్యశాలకు చికిత్సనిమిత్తం తరలించామన్నారు. మంచిర్యాలలో చికిత్స పొందుతున్న శైలజఅనే విద్యార్థినికి మెరుగైనవైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వైద్యం అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ఎవరూ పిల్లలను ఇంటికి తీసుకు వెళ్లవద్దని కోరారు. పాఠశాలలో విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయన్న విషయంపై విచారణ జరుపుతున్నామని ఆమె పేర్కొ న్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పీవో వెంట జీసీడీవో శకుంతల, తహసీల్దార్ రియాజ్ అలీ ఉన్నారు.

పద్మశ్రీ కనక రాజుకు సీఎండీ వరుణ్‌రెడ్డి నివాళులు


కనకరాజు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎన్పీడీసిల్ సీఎండీ వరుణ్ రెడ్డి

జైనూర్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం మండలంలోని మార్లావాయి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గుస్సాడి రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కనక రాజు మృతికిగల కారణాలను ఆయన బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుస్సాడి రాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కనకప్రతిభ వెంకటేష్, సార్మేడి జుగునాక వేవరావ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిశ్కరించాలని సీఎండీని కలిసిన ఉద్యోగులు..

సుదీర్ఘకాలం పాటు పెండింగులో ఉన్న సమస్యల్ని పరిష్కరించాలని జైనూర్, సిర్పూర్ (యు) మండలాల విద్యుత్‌శాఖ ఉద్యోగులు శుక్రవారం ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. విద్యుత్‌శాఖలోని ఆర్టిజెన్స్ ప్రోహిబిషన్ పీరియడ్ ముగిసి రెండేళ్ళు గడుస్తున్నా పదోన్నతులు కల్పించక పోవడంతో తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎంతోకాలంగా పెండింగులో ఉన్న సమస్యల్ని పరిష్కరించాలని విద్యుత్‌శాఖ ఆర్టిజెన్స్ జేఏసీ జిల్లా చైర్మన్ ఆత్రం మారుతి కోరారు.

ఈ సందర్భంగా సత్వరమే ఆర్టిజెన్స్‌లకు పదోన్నతులు కల్పిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. అదేవిధంగా సంస్థ అభివృద్ధి కోసం పాటుపడాలని, లబ్ధిదారులకు మెరుగైన సేవలందించాలని సీఎండీ ఉద్యోగులను ఆదేశించారు. ఉద్యోగులు ఇర్ఫాన్, సుగుణాకర్, రజబాలి, లింగు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

కెరమెరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. శనివారం ఆయన మన్నెగూడ, కల్లెగాం, మురికిలొంక, కేస్లాగూడ, సాకడ, షరి, కొలాంగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పలు అంశాలు బోర్డుపై రాసి చూపించారు. అమ్మ ఆదర్శపాఠశాలల్లో పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. పాఠశాల నిర్వహణ రికార్డులు సరిగ్గా ఉంచాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయనవెంటఎస్‌సీఆర్పీ శ్యాంరావు, ఉపాధ్యాయులు నారాయణ, కర్ను, దాము, రంభ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వాంకిడి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్‌కుక్, అటెండర్ పోస్టుల కోసం అర్హులైన మహిళా అభ్యర్థులు దర ఖాస్తు చేసుకోవాలని ఎంఈవో శివచరణ్‌కుమార్ కోరారు. అసిస్టెంట్ కుక్ కోసం 7వ తరగతి, అటెండర్ కోసం 10వతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 18సంవత్సరాల నుంచి 45సంవత్సరాల వయసు గల మహిళలు ఈనెల4నుంచి 8వరకు స్థానికకేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాల న్నారు. పూర్తివివరాల కోసం కేజీబీవీ పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.


నీటి వినియోగంపై అవగాహన

సిర్పూర్(టి), నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో శనివారం మిషన్ భగీరథద్వారా సరఫరా అయ్యే నీటివిని యోగం, నాణ్యతపై డీఈ పృథ్వీధర్‌రాజ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు మినరల్ వాటర్ కన్నా మంచిదన్నారు. అనంతరం నీటి నాణ్యతపై ల్యాబ్‌టెక్నీషియన్ ప్రసాద్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం లో ఏఈఈ సాయికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

రెబ్బెన, నవంబరు 2: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పురుషుల, స్త్రీల ఎంపిక పోటీలు ఈనెల 4న రెబ్బెన గోలేటి గ్రౌండులో నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ బాల్ బాడ్మింటన్ ప్రధానకార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి తెలిపారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 8నుంచి 10వరకు ఉమ్మడివరంగల్ జిల్లాలో జరిగే అంతర్రాష్ట్ర జిల్లాల బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్‌నెంబరు 9391406736, 9381662413ను సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మిక క్షేత్రం గూడెం గుట్ట



కార్తీక మాసంలో భక్తుల రద్దీ ● పౌర్ణమికి జాతర

దండేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గుట్ట ఆధ్యాత్మిక క్షేత్రంగా కొనసాగుతోంది. గుట్టపై కొలువున్న సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీకమాసంలో స్వామి వ్రతాలను భక్తులు ఆచరిస్తారు. అలాగే ప్రతీ నెల పౌర్ణమి రోజున భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. కార్తీక పౌర్ణమి రోజున జాతర జరుగుతుంది. ఈ జాతరకు పలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వ్రతాల్లో పాల్గొంటారు. మంచిర్యాల - జగిత్యాల జిల్లాల సరిహద్దులో గోదావరి నది సమీపంలో గూడెం గుట్టపై ఆలయం ఉంది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో నిత్యం వందలాది మంది భక్తులు స్వామి దర్శనం కోసం వస్తుంటారు. ఈనెల 15 శుక్రవారం కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా ఆలయాలను అలంకరించనున్నారు. కార్తీక మాసం ముగిసే వరకు గూడెం ఆలయాల వద్ద భక్తులు సందడి నెలకొననుంది. స్వామి వ్రతాలను రోజు ఉదయం 9 నుంచి 3 గంటల వరకు నిర్వహిస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా సుమారు రెండు గంటలకు ఒక బ్యాచ్ చొప్పున జరుగుతుంది. గుట్ట కింద, పైన మండపాల్లో వ్రతాలు నిర్వహిస్తారు. గూడెం గుట్టపై అయ్యప్పస్వామి, శ్రీషిర్డీసాయిబాబా దత్తత సాయి ఆలయం, మరికొంత దూరంలో సదానందస్వామి ఆలయాలు ఉన్నాయి. భక్తులు ఈ ఆలయా లను దర్శించుకుంటారు.


గుట్ట పైన శబరిమలై అయ్యప్పస్వామి దేవాలయం

భక్తుల కార్తీక స్నానాలు

కార్తీకమాసంలో భక్తులు నదీ స్నానాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఆలయం సమీపంలో గోదావరి నది ఉండడంతో ఇక్కడి వచ్చిన భక్తులు ముందుగా నదీ స్నానం ఆచరిస్తారు. అనంతరం స్వామి వ్రతాన్ని ఆచరించి దర్శనం చేసుకుంటారు. పుణ్యస్నానం చేసి దీపారాధన చేస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.

పలు ఆలయాల సమాహారం

గూడెం వాస్తవ్యుడు గోవర్ధన పెరుమాండ్లస్వామి అనే వైష్ణవుడు 1964లో ఆలయాన్ని నిర్మించాడు. అప్పటి నుంచి ఆలయం దినాదినాభివృద్ధి చెందుతూ వస్తోంది. కార్తీక మాసం పౌర్ణమి జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించి, స్వామి వారి వ్రతాలు ఆచరిస్తారు. జనవరి, ఫిబ్రవరి మాసంలో స్వామి వారి కల్యాణం జరుగుతుంది. ఆలయం జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. సత్యదేవుని ఆలయానికి సమీపంలో మరో కొండపై అయ్యప్ప స్వామి, పంచముఖి ఆంజనేయస్వామి, సుబ్రమణ్యస్వామి ఆలయాలను నిర్మించారు. కార్తీక మాసంలో అయ్యప్పస్వాములు దీక్షలు స్వీకరిస్తారు. గుట్టకింద షిర్డీ సాయిబాబా ఆలయం ఉంది. గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

ఆలయంలో భక్తుల రద్దీ

కార్తీక మాసం శనివారం పురస్కరించుకుని సత్యనారాయణ స్వామి ఆలయంలో రద్దీ నెలకొంది. ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వందలాది మందిపైగా భక్తులు కుటుంబసమేతంగా స్వామి వ్రతాలను ఆచరించారు. ఆలయంలోని రావి చెట్టు, ప్రధానాలయం ఎదుట గల ధ్వజస్తంభం వద్ద ఉసిరి కాయలతో కార్తీక దీపాలు వెలిగించారు.


ప్రధానాలయం ఎదుట కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కులగణన సర్వేలో బౌద్ధులుగా నమోదు చేయాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న బౌద్ధ ఉపాసకులు

వాంకిడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేలో జిల్లాలోని బౌద్ధులందరూ రిలీజియన్ కాలమ్‌లో బౌద్ధులుగా, కులం కాలంలో మహర్‌గా నమోదు చేయాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్ కోరారు. శనివారం స్థానిక జౌతావన్ బుద్ధవిహార్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధులుగా కొనసాగుతున్న తమకు తెలియకుండా ఇంతవరకు రిలీజియన్ కాలంలో ఇండియన్ హిందుగా, కులము ఎస్సీ సబ్‌క్యాస్ట్‌గా మాల అని రాస్తున్నామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో మతము బౌద్ధులుగా కులము మహర్ ఎస్సీగా నమోదు చేస్తూ ప్రభుత్వంకల్పిస్తున్న రిజర్వేషన్లను పొందుతున్నారని ఆయన తెలిపారు. జిల్లాలోని బుద్ధిస్టులు ప్రతి ఒక్కరూ కులగణన సర్వేలో తమ మతమును బౌద్ధులుగా, కులము ఎస్సీ మహర్‌గా నమోదుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐజిల్లాఉపాధ్యక్షుడు వినేష్, నాయకులు విజయ్‌ఉప్రె, రోషన్, ప్రతాప్, నూతన్, ప్రకాష్‌కిరణ్, మహేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దండే విఠల్‌కు వైష్ణవి దేవిమాత ప్రసాదం అందజేత


ఎమ్మెల్సీ దండే విఠల్‌కు అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, నవంబరు 2: రాజస్థాన్ రాష్ట్రంలోని బాలాజీటెంపుల్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో వైష్ణవి దేవిమాత ప్రసాదాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్సీ దండే విఠల్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి చంద్రమౌళి, సముద్రాల రాజన్న, శంకర్ గౌడ్, రాచకొండ శ్రీవర్ధన్, కుర్సింగ ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేటలో కమ్ముకున్న దట్టమైన పొగమంచు




చింతలమానేపల్లిలో..

మంచుకురిసే వేళలో..

పెంచికలపేట/చింతలమానేపల్లి/కౌటాల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్నిరోజులుగా ఉష్ణోగ్రతల మార్పుల కారణంగా చలి మొదలైంది. దీంతో శనివారం మండలాల్లో దట్టమైన పొగమంచు కమ్మేసింది. ముఖ్యంగా కౌటాల- కాగజ్‌నగర్, కౌటాల- బెజ్జూరు, కర్జెల్లి, చింతలమానేపల్లి, పెంచికలపేట ప్రధాన రహదారులతోపాటు గ్రామాలకు వెళ్లేరోడ్లపై పొగమంచు కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10గంటలు దాటినా సూర్యోదయం కాకపోవడంతో వాహనదారులు లైట్లువేసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


కౌటాలలో..



సింగరేణిలో కొనసాగుతున్న గైర్హాజరు కార్మికుల కౌన్సెలింగ్

మందమర్రిటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు గనులు, డిపార్టుమెంట్ల వారీగా కౌన్సిలింగ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 11 ఏరియాల్లో నెలల తరబడి గైర్హాజరవుతున్న కార్మికులకు లేఖల ద్వారా సమాచారం అందిస్తోంది. షిఫ్టులవారీగా ఏయే వృత్తుల కార్మికులు గైర్హాజరవుతున్నారు, వారి వ్యక్తిగత, పని వద్ద సమస్యలను ఆరా తీస్తున్నారు. అధికారులు వారంరోజులుగా కౌన్సిలింగ్‌ను ముమ్మరం చేశారు. వృత్తిపరమైన సమస్యలుంటే వాటి పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. ఎలాంటిసమస్యలు లేకున్నా విధులకు గైర్హాజరవుతున్న కార్మికుల మస్టర్లను ఆరాతీసి వారిపైచర్యలు తీసుకోవడానికి యాజమాన్యం సిద్ధమవుతోంది. అన్ని ఏరియాల్లో కూడా ఇప్పటికే గైర్హాజరు కార్మికులవుతున్న వివరాలను సేకరించి వారికి అధికారులు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. బెల్లంపల్లి ఏరియాలో 1027మంది కార్మికులు ఉండగా 10మందికి పైగా తరుచూ గైర్హాజరవుతున్నారు. అదేవిధంగా మందమర్రిఏరియాలో 4966 మంది కార్మికులు ఉండగా 80 మంది గైర్హాజరవుతున్నారని, శ్రీరాంపూర్ ఏరియాలో 9400మంది కార్మికులు ఉండగా 114 మందికి పైగా గైర్హాజరవుతున్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. అధికారులు వీరికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. 5సంవత్సరాల క్రితం ఉద్యోగంలో చేరి వంద మస్టర్లు కూడా నిండని కార్మికులపై యామాన్యం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం


రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేసి ఆర్‌జీ-3 ఏరియాకు బదిలీపైవెళ్తున్న చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ జీఎం కార్యాలయంలో శనివారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చంద్రశేఖర్ మూడుళ్లుగా శ్రీరాంపూర్ ఓసీపీలో ఉత్పత్తి, ఉత్పాదకతకు ఎంతో కృషిచేశారని కొనియాడారు. వర్షాకాలంలో ఓసీపీనుంచి నీటిని తోడడానికి ప్రత్యేకపంపింగ్ విధానాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జిఎస్‌వోటు జీఎం గోపాల్ సింగ్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, ఆర్కే7 గ్రూపు ఏజెంట్ రాముడు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, చంద్రలింగం, మేనేజర్లు అబ్దుల్ ఖాదిర్, తిరుపతి, బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.


శ్రీరాంపూర్: ఇంజనీర్‌ను సన్మానిస్తున్న అధికారులు

రాజేశ్వర్‌రెడ్డి సేవలు మరువలేనివి..

మందమర్రిటౌన్: మందమర్రిఏరియా అభివృద్ధికి ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. శనివారం మందమర్రి ఎస్‌వోటూ జీఎంగా పనిచేసి భూపాలపల్లి ఏరియా జీఎంగా పదోన్నతిపై వెళ్తున్న రాజేశ్వర్‌రెడ్డిని జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జీఎం మాట్లాడుతూ రాజేశ్వర్‌రెడ్డి క్రమ శిక్షణ, నిబద్ధతో విధులు నిర్వహిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఏరియా అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కేకే1గ్రూపు ఏజెంటు రాందాస్, ఎస్‌వోటూ జీఎం విజయ ప్రసాద్, పీఎం శ్యాంసుందర్, అధికారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై దృష్టిసారించిన యాజమాన్యం

మందమర్రిటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని ఎస్సీ, ఎస్టీఉద్యోగుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించింది. వారంరోజుల క్రితం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీ బలరాం నేతృత్వంలో సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపైసమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎస్సీ ఎస్టీ రాష్ట్ర చైర్మన్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎస్సీఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే కొత్తగూడెం కార్పోరేట్ కార్యాలయంలో ఇప్పటికే సెల్‌ను ఏర్పాటుచేశారు. మొత్తానికి సింగరేణిలో ఇకనుంచి ఎస్సీఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కానున్నాయి.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

జైపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్టీపీపీలోని సేవా భవన్‌లో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. డీజీఎం పర్సనల్ ఆజ్మీర తుకారాం, సీనియర్‌పర్సనల్ అధికారి ఠాకూర్‌మోహన్‌సింగ్ పౌరులసమగ్రత ప్రతిజ్ఞ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతిసంవత్సరం సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆవారాన్ని విజిలెన్స్ అవగాహన వారోత్సవాలుగా నిర్వహిస్తారన్నారు. జాతి సమగ్రతలో పటేల్ కృషి పట్టుదల అమోఘమన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తే అవినీతికి తావుండదన్నారు. అనంతరం సేవా సమితిలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలతో పౌరుల సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సేవా సమితి కోఆర్డినేటర్ చిలుక అరుణ, టైలరింగ్ శిక్షకురాలు రఫియా తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

- పోక్సో కేసు నమోదు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ బాలికను పెంచికల్‌పేట మండల కేంద్రానికి చెందిన దుర్గం నరేష్ అత్యాచారం చేశాడు. ఆసిఫాబాద్ పట్టణ సీఐ బుద్దె రవిందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన ఓ బాలికకు నరేష్ మూడు సంవత్సరాల క్రితం ఇన్‌స్టాగ్రాంలో పరిచమయ్యాడు. అప్పటి నుంచి ఫోన్‌లో మాట్లాడుకునే వారు. దీపావళి పండుగ నోములకు బాలిక తల్లిదండ్రులు కాగజ్‌నగర్ మండలం అరెగూడకు వెళ్లారు. దీంతో ఈ విషయం బాలిక శుక్రవారం రాత్రి నరేష్‌కు తెలిపింది. దీంతో అతడు నేను వస్తాను మాట్లాడుకుందామని పేర్కొన్నాడు. ఇంట్లోకి వచ్చిన నరేష్ బాలికకు మాయమాటలు చెప్పి పెండ్లి చేసుకుంటానని అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయగా కాలనీలోని ఇరుగుపొరుగు రావడంతో నరేష్ అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు నరేష్‌పై పోక్సో కేసు కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


తిరుపతి (ఫైల్)

కాసిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవాపూర్ చెందిన చేదం తిరుపతి (26) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దేవాపూర్‌లో తిరుపతి బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి చింతగూడెం నుంచి దేవాపూర్‌లోని ఇంటికి వస్తున్న క్రమంలో ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇందారం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

శ్రీరాంపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఇందారం క్రాస్ రోడ్డు వద్ద శనివారం నాఖాబందీ నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేసి నెంబర్ ప్లేట్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ వెహికల్స్‌కు జరిమానా విధించారు. అనంతరం సరియైన పత్రాలు లేని 58 వాహనాలకు చలాన్స్ విధించగా, రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సీఐ వేణుచందర్, ఎస్ఐ సంతోష్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

భీమారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎస్ఐ శ్వేత శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి, అతి వేగంగా వాహనాలు నడపవద్దన్నారు. రాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఆసిఫాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జరిగిన ఘర్షణలో పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్‌తోపాటు మరో ఎనిమిది మందిపై, కాంగ్రెస్ జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్‌తోపాటు మరో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ బుద్ధె రవిందర్ తెలిపారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

చెన్నూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో మునిగి మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకుంటామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలోని గోదావరి నదిలో మునిగి మృతిచెందిన కొండ అరుణ్‌కుమార్, దాసరి సాయి కుటుంబాలను శనివారం ఎంపీ దుగ్నేపల్లి గ్రామానికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్త మల్లేష్ తల్లి ఇటీవల మృతి చెందగా ఆయనను పరామర్శించారు. ఎంపీ వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటి యజమాని గుర్తింపు సర్వే పరిశీలన


గుర్తింపు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో, తదితరులు

కోటపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటి యజమాని గుర్తింపు సర్వేను శనివారం మంచిర్యాల ఆర్డీవో జి.శ్రీనివాసరావు పరిశీలించారు. సంబంధిత అధికారులు ఇంటింటికి వచ్చి సర్వే చేపడతారని, యజమానులు సహకరించాలని ఆయన కోరారు. తహసీల్దార్ మహేంద్రనాథ్, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

తుర్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం లేక ఇబ్బందులు

మందమర్రిరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సారంగపల్లి పంచాయతీలోని తుర్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం లేక గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. తుర్కపల్లి నుంచి సారంగపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటే 2 కిలోమీటర్ల వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 650 మందికి పైగా జనాభా ఉన్న తుర్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించి తుర్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా జనరేటర్

కాసిపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న జనరేటర్ అలంకార ప్రాయంగా మారింది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ జనరేటర్ తుప్పు పట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు. 2008లో రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీవో కార్యాలయంలో జనరేటర్ ఏర్పాటు చేసింది. ఏపీస్వాన్‌తో ఒప్పందం చేసుకుని ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్ సేవలకు అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ ఉండేలా జనరేటర్ ఏర్పాటు చేశారు. జనరేటర్‌కు రూ.10 లక్షల వరకు ఖర్చు చేసింది. అంతర్గత కేబుల్, నెట్‌వర్క్, కంప్యూటర్ సిస్టం, లైట్లు, ఫ్యాన్‌లకు సరిపోయేలా జనరేటర్ ఏర్పాటు చేశారు. అధికారుల అలసత్వం, నిర్వహణ లోపం వల్ల జనరేటర్ నిరుపయోగంగా మారింది. జనరేటర్‌ను వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుండానే ఇళ్ల నిర్మాణాలు

(5వ పేజీ తరువాయి)

డిస్ట్రిక్ట్ లే అవుట్ కమిటీ రిపోర్టు బుట్టదాఖలు....

డిస్ట్రిక్ట్ లే అవుట్ కమిటీ ఫీల్డ్ ఎంక్వయిరీ చేసి కలెక్టర్‌కు ఇచ్చిన ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్‌లో నాలుగు భవనా లను అక్రమంగా నిర్మించారని స్పష్టంగా పేర్కొన్నది. డిస్ట్రిక్ లే అవుట్ కమిటీ సభ్యులు వెంచర్‌లోని 11, 12, 13, 14 నెంబర్లుగల ప్లాట్లలో ఎటువంటి అనుమతులు లేకుండా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆగస్టులో కలెక్టర్‌కు రిపోర్టు ఇవ్వగా, ఆ తరువాత మున్సిపల్ అనుమతులు రావడం గమనార్హం.

ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్‌లో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నప్పటికీ నిర్మాణ అనుమతులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా డిస్ట్రిక్ట్ లే అవుట్ కమిటీ సభ్యులైన జిల్లా పంచాయతీ అధికారి, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారులు తమ ఎంక్వైరీ రిపోర్టును ఆగస్టు 6న కలెక్టర్‌కు అందజే శారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్ నెంబర్లు 11 నుంచి 14 వరకు ఇళ్ల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. అయినప్పటికీ అవే ప్లాట్లకు సంబంధించి ఇళ్ల నిర్మాణ అనుమతులు సెప్టెంబరు 25న జారీ కావడం గమనార్హం. ఈ తతంగం వెనుక పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీష్‌ను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నిర్మాణ అనుమతులు ఇలా.....

నస్పూర్ మున్సిపల్ అధికారులు పై నాలుగు ఇళ్లకు జారీ చేసిన నిర్మాణ అనుమతుల వివరాలు ఇలా ఉన్నాయి.

1. 428382/ఎన్ఎఎస్‌పీ/0221/2024, తేదీ 25-09-2024
2. 428394/ఎన్ఎఎస్‌పీ/0222/2024, తేదీ 25-09-2024
3. 428446/ఎన్ఎఎస్‌పీ/0223/2024, తేదీ 25-09-2024
4. 428459/ఎన్ఎఎస్‌పీ/0224/2024, తేదీ 25-09-2024

ముగిసిన దండారీ ఉత్సవాలు



రాముగూడెంలో దండారీ ముగింపు ఉత్సవాల్లో అధికారులు, గిరిజనులు

తాండూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్ పంచాయతీలోని రాముగూడెంలో గిరిజన దండారీ ఉత్సవాలు శనివారం ముగిసాయి. దీపావళి తర్వాత రెండు రోజులు కొలబొడి కార్యక్రమాన్ని నిర్వహించి దండారీ ఉత్సవాలు ముగిస్తామని గిరిజన పెద్దలు తెలిపారు. గుస్సాడీలు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌పటాన్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఏఈ విష్ణు, మాజీ ఉపసర్పంచు పరపతిరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్, మల్లేష్, సత్యనారాయణ,పర్వతాలు, అమృత రావు, తిరుపతి పాల్గొన్నారు.

పత్తి పంటకు రోగాల పోటు





నెన్నెలలో తెగులు సోకి దెబ్బతిన్న పత్తిచేను

ఎండిపోతున్న పత్తి చెట్టు

- చీడపీడల దాడి...ఆఖరు దశలో తెగుళ్ల ఉధృతి
- నెల రోజులకు ముందే ఎండిపోతున్న చేలు
- మందులకు లొంగని లద్దెపురుగు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడులు రావని రైతుల్లో ఆందోళన

పత్తి రైతు పరేషాన్‌లో పడ్డాడు. సీజన్ ప్రారంభంలో ఆశాజనకంగా ఉన్న పత్తి పంట ఆఖరు దశలో తెగుళ్లు, చీడపీడలు విజృంభించడంతో దెబ్బతింటోంది. తెగులు ఉధృతికి రెండో దఫా పిందె కాయ కట్టక ముందే ఆకులు రాలిపోతున్నాయి. వర్షాలు లేక బలహీన పడిన పంటకు తెగులు తోడై నెల రోజుల ముందే చేలు ఎండిపోతున్నాయి. మరోవైపు లద్దెపురుగు విజృంభణ రైతులను బెంబేలెత్తిస్తోంది. రసాయన మందులు పిచికారి చేసినా లాభం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతికూల వాతావరణం, చీడపీడల దాడి వెరసి దిగుబడి సగానికి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కాయను తింటున్న పొగాకు లద్దెపురుగు

నెన్నెల/కాసిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పత్తి పంటకు తెగులు సోకడం, లద్దె పురుగు విజృంభించడం రైతన్నకు శాపంగా మారింది. ప్రతీ చేలో ఏదో ఒక రోగం సోకి పంట దెబ్బతిన్నది. ఈ యేడు ఎండు తెగులు ఉధృతి అధికంగా ఉంది. దీనికి తోడు దాదాపు నెల రోజుల పాటు వర్షం లేక పోవడంతో ఆకులు ఎండి రాలి పోయాయి. డిసెంబరు వరకు పచ్చగా ఉండాల్సిన చేలు నెల ముందుగానే ఎండిపోతున్నాయి.

మొదలు కాసిన కాయలు గింజ కట్టకుండానే పగిలాయి. ముందుగా పగిలిన పత్తి బరువు తూగదని రైతులు అంటున్నారు. పదిహేను రోజుల కిందట వర్షం ఉంటే పూతంతా కాతగా మారేది. చెట్లు ఎండి పోయాక వర్షం కురిసిందని, ఇప్పుడు కురిసిన వానతో ప్రయోజనం లేదంటు న్నారు. మూడు సార్లు పత్తి ఏరాల్సి ఉండగా, ఒకే దఫాతో పత్తి సేకరణ పూర్తయ్యేలా ఉందని రైతులు అంటున్నారు.

పొగాకు లద్దెపురుగు ఉధృతి

ఈ యేడు పత్తిలో లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉంది. మాయదారి చీడ రైతుల ఆశలను తొలి చేసింది. కాయలు పెరిగే దశలో పురుగు ఉధృతితో రైతులకు దిక్కుతోచడం లేదు. రోజుల వ్యవధిలోనే ఆకులను, పూత, పిందె, కాయలను తినేస్తున్నాయని రైతులు తెలిపారు. పురుగు నియంత్రణకు రైతన్నలు నానాపాట్లు పడుతున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టి మందులు స్ప్రే చేస్తున్నారు.

గతంలో ఒకేసారి పురుగు మందు స్ప్రే చేస్తే లార్వా నుంచి పురుగుల వరకు నాశనం అయ్యేవి. పురుగులను అదుపు చేసేందుకు ఒక్కో రైతు మూడు సార్లు మందులు పిచికారి చేశారు. మందు స్ప్రే చేసిన వారం పదిరోజుల్లో చేలల్లో పురుగులు మళ్లీ కనిపిస్తున్నాయని రైతులు పేర్కొన్నారు. బీటీ పత్తిలో సాధారణంగా 90 రోజుల వరకు కాయతొలుచు పురుగును తట్టుకునే నిరోధక శక్తి ఉంటుంది. దీంతో 100 నుంచి 120 రోజులు దాటిన తర్వాత పురుగుల ఉనికి కనిపించేది. ఈ యేడు 70- 80 రోజుల వయసు నుంచే పొగాకు లద్దె పురుగు సోకింది.

పెరిగిన విస్తీర్ణం.. తగ్గనున్న దిగుబడి

ఈ సీజన్‌లో జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గతేడాది కంటే ఈ యేడు 15 వేల ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. సాగు విస్తీర్ణం పెరిగినప్పటికి ప్రతికూల పరిస్థితులు, చీడపీడల కారణంగా దిగుబడులు తగ్గనున్నాయి. చెట్టుకు వందకు పైగా కాయలు ఉండాల్సింది. 20 నుంచి 25 కాయలు మాత్రమే ఉన్నాయి. ఉన్న కాయలు కూడా సైజు పెరగడం లేదని అంటున్నారు. సాదారణంగా ఎకరానికి పది నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. అలాంటిది ఆరు నుంచి ఏడు క్వింటాళ్లు దిగుబడి రావడమే కష్టమని రైతులు అంటున్నారు.

తీరని నష్టాన్ని మిగిల్చింది

సామల భీమయ్య, ధర్మారావుపేట, కాసిపేట



ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. వర్షాలు మొదట్లో మంచిగా కురిశాయి. దీంతో చెట్లు ఏపుగా పెరిగాయి. కానీ కాయలు లేవు. కొంత పూత దశలో ఎండ వేడికి రాలిపోగా, మరికొన్ని కాయలు వచ్చిన తర్వాత రాలిపోయాయి. చెట్టుకు 20 కాయలకు మించి లేవు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

సగం చేను ఎండిపోయింది

అల్లంపల్లి సత్తయ్య, రైతు, ఘన్‌పూర్



నందులపల్లిలో ఆరు ఎకరాల చేను కౌలుకు తీసుకొని పత్తి వేశాను. మొదట మంచిగా ఎదిగింది. పదిహేను రోజుల కిందట తెగులు సోకింది. వారం పది రోజుల్లోనే సగం చేను ఎండిపోయింది. మిగతా చెట్లు కూడా వడలిపోతున్నాయి. ముందుగా కాసిన కాయలే తప్ప ఆ తర్వాత వచ్చిన పూత కాత రాలిపోయింది. యేటా మూడు సార్లు పత్తి ఏరే వాళ్లం ఈ సారి ఒక్క సారికే చేను ఖాళీ అయ్యేలా ఉంది.



పచ్చదోమతో వచ్చిన ఆకుముడత

మందులకు లద్దె పురుగు లొంగడం లేదు

సుంకరి బాపు, రైతు, నెన్నెల



పొగాకు లద్దెపురుగు పత్తికి తీవ్రంగా నష్టం చేస్తోంది. ఈ ఏడు వర్షాలు లేక చేలు సరిగ్గా ఎదగనే లేదు. పూత, కాతను దక్కించుకుందామంటే లద్దె పురుగు దాపురించింది. రెండుమూడు రోజుల వ్యవధిలోనే చేనంత మేసేస్తున్నాయి. పూత, గూడ, కాయలను తినేస్తున్నాయి. ఇప్పటికి మూడు సార్లు పురుగు మందు పిచికారి చేశాను. మందుకు పురుగులు లొంగడం లేదు. వేలకు వేలు ఖర్చవుతోంది.

నేడు భగినీ హస్త భోజనం

● తోబుట్టువుల ఇంట్లో భుజించడం విశిష్టత

నస్పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కుటుంబాల్లోని వారందరు ఒకరినొక్కరూ ఐక్యంగా ఉండేవారు. ఒకచోట కలిసి భోజనం చేస్తూ కబుర్లతో గడిపేవారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరికి వారే ఉండే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఏడాదిలో ఒక రోజైనా తోబుట్టువులతో కలిసి భోజనం చేయాలన్నదే 'భగినీ హస్త భోజనం' విశిష్టత. కార్తీక మాసం శుక్ల విదియ రోజున సోదరి ఇంట్లో భోజనం చేయడాన్ని భగినీ హస్త భోజనం అంటారు. ఆదివారం భగినీ హస్త భోజనం నిర్వహిస్తారు.

● పురాణ గాథ...

యమున, యమధర్మరాజు అన్నా చెల్లెలు. యమునకు సోదరుడిని ఇంటికి పిలిచి సత్కారం చేయాలని కోరిక ఉండేది. యమధర్మరాజు ఒక రోజు చెల్లెలు ఇంటికి వెళుతారు. ఆ రోజున కార్తీక శుక్ల విదియ. సోదరున్ని స్వాగతించి వంట చేసి పెడుతుంది. అందుకు సంతృప్తి చెందిన యమధర్మరాజు ఏదైనా వరం కోరుకోమంటాడు. కార్తీక శుక్ల విదియ నాడు అక్క, చెల్లెలు ఇంటికి వెళ్లి వారి చేతి వంటను తినేలా వరం ఇవ్వాలని కోరుకుంటుంది. అందుకు యమధర్మరాజు వరమిచ్చాడని పురాణ గాథలు వెల్లడిస్తున్నాయి.

ఈ నెల 8న జిల్లాలో యువజనోత్సవాలు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న యువజనోత్సవాలు నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజ్‌వీరు ఒక ప్రకటనలో తెలిపారు. 15-35 మధ్య వయస్సు గల బాలబాలికలు, యువతీ, యువకులు పాల్గొనాలన్నారు. జిల్లాలో ప్రథమ స్థానంలో వచ్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఫోక్ డ్యాన్స్, గ్రూప్ ఫోక్‌సాంగ్, సోలో ఫోక్, పోయెట్రి, స్టోరీ రైటింగ్, పెయింటింగ్ అంశాల్లో పోటీలు జరుగుతాయని, విద్యార్థులు, కళాకారులు హాజరు కావాలన్నారు.

గోర్ బోలిని మాతృభాషగా నమోదు చేసుకోవాలి

బెల్లంపల్లిరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వేలో లంబాడీ భాష గోర్ బోలిని మాతృభాషగా నమోదు చేసుకోవా లని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు భుక్య రామునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులకు గోర్ బోలి భాషను నమోదు చేయాలని పేర్కొనాలని సూచించారు.

నిషేధాజ్ఞలు కొనసాగింపు

మంచిర్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేని డ్రోన్, డీజే సౌండ్స్ వినియోగించడాన్ని నెల రోజులపాటు నిషేధిస్తున్నట్లు సీపీ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిషేధాజ్ఞ లను కొనసాగిస్తున్నట్లు, పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకొంటామని సీపీ హెచ్చరించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మంచిర్యాల అర్బన్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని హాజీపూర్ మండలానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, 170 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అందజేశారు. శనివారం ఎమ్మెల్యే నివాసం వద్ద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల వివాహాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తూ బాసటగా నిలుస్తోందన్నారు. అర్హులైన వారందరికి చెక్కులను అందించామన్నారు. అలాగే అనారోగ్యానికి గురై ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొంది ఖర్చులకు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులను ఇప్పించామన్నారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండే, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బెల్లంపల్లిరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డులో రూ.3 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ కొన్నేళ్ళుగా రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. అనంతరం వివిధ వార్డుల్లో జరుగుతున్న కుల గణన సర్వేను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, సాయికిరణ్,కౌన్సిలర్లు సుజాత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

గర్మిళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు వినతి పత్రం అందించారు. మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కుల గణనపై జరిగిన సమావేశంలో ఆయన ఎంపీని కలిసి వినతి పత్రం అందించారు. డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, బీసీలకు ఉద్యోగాలు, ఉన్నత విద్యలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు.

ఈ నెల 5న రాష్ట్రస్థాయి చెస్ ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలం బురదగూడెం లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ఈనెల 5న అండర్-14, 17 బాలబాలికల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సిహెచ్.ఫణిరాజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లుల శివ సౌజన్యంతో పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన 5గురు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని ఆయన తెలిపారు. చీఫ్ ఆర్బిటార్ కల్పన: 8978146456 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వంద శాతం అక్షరాస్యత దిశగా కృషి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వంద శాతం అక్షరాస్యత సాధన దిశగా కృషి చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధన దిశగా న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం ద్వారా చర్యలు తీసుకొంటామ న్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, ఇందుకోసం వాలం టరీ టీచర్లను గుర్తించి వారి ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులకు విద్యాభ్యాసం అందించి అక్షరాస్యులుగా మార్చేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, సహాయ కులు వారి పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

చెన్నూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభ మయ్యాయి. అండర్ 14, 17 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈవో రాధాకృష్ణమూర్తి హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెస్ చార్జీల పెంపుపై హర్షం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్, మంచిర్యాల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ రజితలు తెలిపారు. శనివారం మంచిర్యాల హైటెక్ సిటీలోని మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కళోత్సవ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో

మంచిర్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో విజేతగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి ఎం.శ్రీవత్సను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య అభినం దించారు. డీఈఓ మాట్లాడుతూ శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ఆధ్వ ర్యంలో హైదరాబాద్ సీసీఆర్‌టీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో విజువల్ ఆర్ట్స్ (దృశ్యకళలు) విభాగంలో పట్టణంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి శ్రీవత్స (ఎంపీసీ, మొదటి సంవత్సరం) మొదటి స్థానంలో నిలిచి 2025లో మధ్యప్రదేశ్‌లో జరగ నున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థి వెంట తల్లి సరస్వతి ఉన్నారు.

సేంద్రియ రైతు ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో మాట్లాడుతున్న శివకృష్ణ

మంచిర్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత మంచిర్యాలలోని గోశాల ఆవరణలో శనివారం సేంద్రియ రైతు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో ఫెర్టిలైజర్స్, రసాయనిక ఎరువు మందులను వాడటం వల్ల కలిగే నష్టాలను, సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని, రైతులు సాగులో సంప్రదాయ పద్ధతులను అనుసరించాలని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు ఉత్పత్తవుతాయన్నారు. ఎఫ్‌పీసీ సలహాదారు గోనే శ్యామ్ సుందర్ రావు, డైరెక్టర్లు బొడ్డు శంకర్, పూస్కూరి శ్రీనివాస్ రావు, బొలిశెట్టి తిరుపతి పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కాసిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ముత్యంపల్లి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కైసర్‌రాజ్ అన్నారు. శనివారం చిన్న ధర్మారంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో మాట్లాడారు. స్వయం సహాయ సంఘాలకు ఆర్థిక రుణాలు అందజేస్తామన్నారు. ముద్ర రుణాలు, పొదుపు, డిజిటల్ చెల్లింపులు, బీమా పథకాలు, సుకన్య సమృద్ధి యోజన తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం కోమటిచేనుకు చెందిన బెడ్డల మౌనిక కరెంటు షాక్‌తో మృతిచెందగా ఆమెకు ప్రమాద బీమా రూ.436 చెల్లించగా రూ.2 లక్షల చెక్కును భర్త రాజేష్‌కు అందజేశారు. ఫీల్డ్ ఆఫీసర్ సాయికృష్ణ, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కోఆర్డినేటర్ రాహుల్‌రాజ్‌కుమార్, ఏఈవో కృష్ణ, సీసీ శారద, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో ఎస్ఈ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రావణ్‌కుమార్

గర్మిళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అధికారులతో ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రావణ్‌కుమార్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీపీఎల్ సర్వీసులు, మీసేవ సర్వీసులు, యువర్ లోడ్, చేపట్టాల్సిన మరమ్మతులపై సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీఈ కైసర్, ఏడీలు వేణుగోపాల్, మోహన్‌రెడ్డి, బాలకృష్ణ, రాజశేఖర్,ఏఈలు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ సుధాకర్

కోటపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆటల్లో గెలుపోటములు సహజమని, అయితే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పోటీలను విజయవంతం చేయాలని రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని ఎసన్‌వాయి గ్రామంలో గ్రామయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎస్ఐ రాజేందర్, పాఠశాల హెచ్ఎం ప్రకాష్, కార్యదర్శి తాజుద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌తో పాటు వాలీబాల్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

జైపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వేలో సంబంధిత ప్రొఫార్మాలో కుటుంబాల వివరాలు ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సూచించారు. అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అంటించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీఎం రాజ్‌కుమార్, కార్యదర్శి ఉదయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన ప్రత్యేకాధికారి

తాండూర్: అచ్చలాపూర్, గోపాల్‌నగర్, బోయపల్లి గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మండల ప్రత్యేకాధికారి అంజయ్య పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ యజమానుల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండానే ఇళ్ల నిర్మాణాలు

- నస్పూర్ మున్సిపాలిటీలో నిబంధనలు గాలికి
- ఓ వెంచర్ నిర్వాహకుడికి అధికారుల వత్తాసు
- పర్మినెంట్ లే అవుట్ రాకున్నా యథేచ్ఛగా నిర్మాణాలు



అక్రమంగా నిర్మాణ అనుమతులు జారీ అయిన ఇళ్లు ఇవే

మంచిర్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం ప్రారంభించే ముందు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అనుమతులు తీసుకుంటాం. అనంతరం నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టవలసి ఉంటుంది. అందుకు భిన్నంగా నస్పూర్ మున్సిపాలిటీలో కట్టిన ఇళ్లకు నిర్మాణ అనుమతులు జారీ చేయడం చర్చనీయాంశమవుతోంది. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెందిన వెంచర్‌లో ఈ అక్రమ బాగోతం వెలుగులోకి వచ్చింది. అంగబలం ఉన్న వారికి ఓ న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా అంటూ అధికారుల వైఖరిని ఎండగడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లిలో సర్వే నెంబర్లు 16, 38, 39లో డీటీసీపీ లేఅవుట్ అను మతుల కోసం కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019, టీఎస్ బీపాస్-2020 ప్రకారం టెంటేటివ్ అప్రోవల్‌తో వెంచర్‌లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. ఫైనల్ లే అవుట్ అప్రోవల్ రాకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. అలా చేపట్టే నిర్మాణాలకు ఆయా సంస్థలు అనుమతులు జారీ చేయకూడదు. అయితే ఫైనల్ లే అవుట్ అనుమతులు రాకుండానే నాలుగు ప్లాట్లలో భవన నిర్మాణాలు చేపట్టారు. ఆ ఇళ్ల నిర్మాణాలు కూడా దాదాపుగా పూర్తి కావచ్చాయి.

టెంటేటివ్ లే అవుట్ అనుమతులు పొందిన వెంచరు నిర్వాహకులు అందులో ప్రజల సౌకర్యార్థం రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, పార్కు పనులు చేపట్టాల్సి ఉంటుంది. అవన్నీ పూర్తయ్యే వరకు తామే బాధ్యులమంటూ వెంచరు స్థలం విస్తీర్ణంలో 15 శాతం భూమిని మున్సిపాలిటీ పేరిట మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారంటూ మున్సిపల్ అధికారులు నిర్ధారించుకున్న తరువాత మార్టిగేజ్ స్థలాన్ని రిలీజ్ చేస్తారు. అప్పుడే వెంచర్లో భవన నిర్మాణాలు చేపట్టేందుకు మున్సిపాలిటీ అనుమతులు లభిస్తాయి. ఈ విషయం టెంటేటివ్ లే అవుట్ అనుమతి పత్రంలో స్పష్టంగా ఉంటుంది. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘిస్తే సదరు టెంటేటివ్ లే అవుట్ అనువతులు కూడా రద్దవుతాయి. అందుకు భిన్నంగా ఫైనల్ లే అవుట్ రాకున్నా నిర్మాణం పూర్తి చేసుకున్న నాలుగు ఇళ్లకు నస్పూర్ మున్సిపల్ అధికారులు నిర్మాణ అనుమతులు జారీ చేయడం కొసమెరుపు.

(మిగతా 7వ పేజీలో)

ఇంటింటి సమగ్ర సర్వే సక్రమంగా నిర్వహించాలి



పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వే సక్రమంగా జరిగేలా నాయకులు, కార్యకర్తలు చూడాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శనివారం మందమర్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని, ఒక వైపు బీసీ కుల గణన చేపట్టడానికి నిర్ణయం తీసుకోవడం, మరో వైపు సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడం గొప్ప విషయమన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాల్లో భాగస్వాములై పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా ప్రతిపక్షాలు ముందుకు వెళ్తున్నాయని, వారి మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలులేరన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎంపీని సన్మానించారు. నాయకులు బండి సదానందం యాదవ్, అబ్దుల్ అజీజ్, మంద తిరుమల్, విజయ్, గణేష్, బండి శంకర్, పాల్గొన్నారు.

కులగణన సర్వే సాధ్యం కాదు

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యర్శుల వెల్లడి

మంచిర్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు డ్యూటీలు వేసి ఉదయం విద్యాబోధన, మధ్యాహ్నం సర్వే చేయాలని ప్రభుత్వం సూచించడం సరైంది కాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం విద్యార్థులను ఇంటికి పంపిస్తే తల్లితండ్రులు అంగీకరించరని, సర్వేకు మధ్యాహ్నం సమయం అనుకూలమైంది కాదని తెలిపారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సహా ఎక్కువ మందికి డ్యూటీ వేసి తక్కువ ఇండ్లను కేటాయించవచ్చన్నారు. అక్టోబర్ 30న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉపాధ్యాయులతో జరిపిన సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని పాఠశాల విధులకు అంతరాయం కల్గకుండా విద్యాశాఖ ఉత్తర్వులను జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

పత్తి పంటకు రోగాల పోటు

- చీడపీడల దాడి...ఆఖరు దశలో తెగుళ్ల ఉధృతి
- నెల రోజులకు ముందే ఎండిపోతున్న చేలు
- మందులకు లొంగని లద్దెపురుగు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడులు రావని రైతుల్లో ఆందోళన

7



కాసిపేట మండలం ధర్మరావుపేటలో కాయలు కాయని పత్తిచేను

బాలికపై అత్యాచారం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

6

ఆధ్యాత్మిక క్షేత్రం గూడెం గుట్ట

కార్తీక మాసంలో భక్తుల రద్దీ

పౌర్ణమికి జాతర

6



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

వర్గీకరణ జరిగే వరకు ధర్మయుద్ధం ఆగదు

మందకృష్ణ మాదిగ



జన్నారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ప్రభుత్వంపై ధర్మయుద్ధం ఆగదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జ్యోతి ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ధర్మయుద్ధ సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాట తప్పారన్నారు. మాటలతో మభ్య పెడుతున్నారే తప్ప వర్గీకరణపై అడుగు ముందుకు వేయలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 30 ఏండ్లుగా ఎన్నో ఉద్యమాలు చేపడుతూ ఎస్సీ వర్గీకరణ, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పోరాడుతు న్నామన్నారు. ఫలితంగా సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసు కోవ చ్చని తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ధర్మయుద్ధం చేస్తూనే ఉంటామని, దీనికి అన్ని వర్గాల వారు సహకరించాలన్నారు. రాష్ట్రంలో మాదిగలు అన్ని విధాలుగా వెనకబడి ఉన్నారని, వారిని గుర్తించి వర్గీకరణకు పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాదిగ, సమ్మయ్య, శ్రీనివాస్ మాదిగ, ప్రభుదాస్ మాదిగ, రమేష్, రవి, రమేష్, శీనయ్య, ఇందయ్య, రమేష్, ఎల్లయ్య, రాజేష్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా మద్దతు ధర నిర్ణయించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోందని, జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆర్‌పీఎం 18 నుంచి 20 వరకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సన్న రకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందని, ఈ క్రమంలో సన్నరకం, దొడ్డు రకం వడ్ల సేకరణకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, కేంద్రాలకు అవసరమైన యంత్రాలు, పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రతీ ఒక్కరు పౌర హక్కులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అట్రాసిటీ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ బాధితులకు సత్వర న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో సివిల్ రైట్స్‌డే సందర్భంగా నిర్వహించే సభల్లో అధికారులు హాజరయ్యేలా చూడాలని, ఆర్డీవో పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కళాజాత ద్వారా సివిల్ రైట్స్‌డే, పౌర హక్కులు, అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు విచారణతోపాటు ఎఫ్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు సంబంధిత ఎస్‌హెచ్‌వోలు, సీఐ, ఎస్ఐల సమన్వయంతో విచారణ ప్రక్రియ వేగంగా జరుపుతామన్నారు. ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, వెంకటేశ్వర్లు, జిల్లా షెడ్యూల్డు కులాల ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు వెంకటేశం, అధికారులు పాల్గొన్నారు.

అధిక లోడ్‌తో వెళ్తే జరిమానా విధిస్తాం

శ్రీరాంపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తే జరిమానా విధిస్తామని ఎంవీఐలు కిశోర్ చంద్రారెడ్డి, రంజిత్‌రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి సీసీసీ వరకు అధికలోడ్‌తో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. 30 వాహనాలను తనిఖీ చేసి ఓవర్‌లోడ్, ఫిట్‌నెస్, పన్ను చెల్లించకుండా ఉన్న ఆరు వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. వాటన్నింటికి మూడు లక్షల రూపాయలు జరిమానా విధించామని పేర్కొన్నారు. రెండు వాహనాలు ఆర్‌టీసీ డిపోకు, నాలుగు వాహనాలు సీసీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కానిస్టేబుళ్లు రాము, వేణుగోపాల్, రవి, హోంగార్డులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

దండేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు పొగమంచు కమ్మేసింది. పొగ మంచుతో రహదారి కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహన డ్రైవర్లు లైట్లు వేసుకొని మెల్లగా ప్రయాణం సాగించారు.



సీహెచ్‌పీల సామర్థ్యం పెంచాలి

సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బొగ్గు రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు(సీహెచ్‌పీ) సామర్థ్యం పెంచాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న 80 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు రవాణా సామర్థ్యాన్ని 100 మిలియన్ టన్నులకు చేర్చే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీహెచ్‌పీలు, భారీ యంత్రాల పనితీరుపై సమీక్షించారు. రానున్న రోజుల్లో సింగరేణి బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 100 మిలియన్ టన్నులకు చేరనుందని, ప్రస్తుతం కోల్‌బెల్ట్‌లో 11 సీహెచ్‌పీలు ఉన్నాయని, వీటికి అదనంగా మరో 2, ఒక సైడింగ్ ఏడాదిలోగా అందుబాటులోకి రానున్నాయన్నారు. 5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో మందమర్రి ఏరియాలో 2 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కేకే-1 రైల్వే లోడింగ్ సైడింగ్‌ని నిర్మించనున్నామని, ఈ పనులన్నీ వేగంగా పూర్తి చేయాలనిఅధికారులను ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు బొగ్గు రవాణా కూడా చాలా కీలకమని, బొగ్గు లోడింగ్ కోసం వచ్చిన రేకులను వెంటవెంటనే నింపి పంపించాలని, జాప్యం వలన పెనాల్టీలు పడే అవకాశం ఉందన్నారు. యంత్రాలను పూర్తి పనిగంటలు వినియోగించి రోజుకు కనీసం 2.00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం భారీ యంత్రాల వినియోగం 13 నుంచి 14 గంటలు మాత్రమే ఉందని, దీనిని కచ్చితంగా 20 గంటలకు పెంచాలని అప్పుడే లక్ష్యాలు సాధించగలమని చెప్పారు. అన్ని ఏరియాల నుంచి జనరల్ మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

కులగణనపై అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం





పాల్గొన్న కుల సంఘాల నాయకులు, సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కుల గణనపై అన్ని కుల సంఘాల నాయకులు తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అన్ని కుల సంఘాలతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ-ప్రేంసాగర్‌రావు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వే ద్వారా కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. తద్వారా ఆ కుటుంబాల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ గడ్డం వంశీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకే ఈ సర్వేను చేపట్టనుందని, పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేపై కుల సంఘాల నాయకులు వారి వారి అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ చైర్మన్ సురిమిల్ల వేణు, అన్ని పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కులం పేరు సవరించాలని ఎమ్మెల్యేకు వినతి

నేతకానీల కుల ధ్రువీకరణ పత్రాల్లో నేతకాని కాకుండా నేథని అని వస్తుందని, ప్రభుత్వం చేపడుతు న్న కులగణనలో దాన్ని సవరించి నేతకానిగా మార్చేం దుకు కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు నేతకాని మహార్ సంక్షేమ సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, గోళ్ళ రాజమల్లు, కళాలి నర్సయ్య, గోమాసే రాజన్న, అనపర్తి యువరాజ్, కామెర అనూష, పెరుగు తిరుపతి, సునార్కర్ రాంబాబు, జునుగూరు సత్యం, జుమ్మిడి లక్ష్మ ణ్, దాగం శంకర్, కామెర నాగయ్య పాల్గొన్నారు.



వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మాతా శిశు ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

గర్మిళ్ల: మంచిర్యాల పట్టణంలోని గోదావరి నది తీరంలో ఉన్న మాతా శిశు ఆసుపత్రిని శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డితో కలిసి వార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన వారిని వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్, కరీంనగర్ లాంటి ప్రాంతాల్లో అందిస్తున్న వైద్య సేవలను త్వరలోనే మంచిర్యాలలో అందుబాటులోకి తీసుకువస్తానని, ఐబీలో నిర్మించే ఆసుపత్రిని ఆరు నెలల్లో పూర్తి చేసి ఎంసీ హెచ్‌ను ఇక్కడకు తరలిస్తామని తెలిపారు. ఆర్ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే ఆక్రమణల తొలగింపు

మంచిర్యాల అర్బన్: పట్టణాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసేందుకే మార్కెట్‌లోని ఆక్రమణలను తొలగిస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం మార్కెట్‌ను అధికారులు, నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం లైబ్రెరికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకొని ప్రభుత్వ కొలువులు సాధించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ అక్రమణల తొలగింపుతో రోడ్లన్నీ విశాలంగా మారాయని, త్వరలో రోడ్లను నిర్మించడంతోపాటు సెంటర్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆక్రమలను తొలగించిన వ్యాపారస్తులందరికి ధన్యవాదాలు తెలిపారు. అవకాశం ఉంటే వారందరికి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. వైస్ చైర్మన్ సల్ల మహేష్, మున్సిపల్ కమీషనర్ మారుతీ ప్రసాద్, టీసీఎస్ శ్యామ్‌సుందర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.